# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-02-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.**

3. **రాష్ట్రంలో ప్రాంతాలవారీగా పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్.**

4. **కల్తీ పాల ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పాల సరఫరా కేంద్రాలు, పాడిపరిశ్రమల సంస్థలపై తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార భద్రత అధికారులు.**

==========================

శ్రీకాకుళంలో అతిసార వ్యాధి, రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల అధికారులతో మాట్లాడారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

శ్రీకాకుళంలో ప్రస్తుతానికి 76 మంది అతిసార బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ఇద్దరు మినహా అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాను ఆపేశామని.. ప్రత్యామ్నాయాల ద్వారా సురక్షితమైన తాగు నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

ఇక రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో బాధితులకు వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. స్థానికంగా సేకరించిన పాల నమూనాలను ఇప్పటికే ప్రయోగశాలకు పంపామని చెప్పారు. ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

--------------------------

కల్తీ పాల ఘటన బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాజమహేంద్రవరంలో స్థానిక శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ నిన్న పంపిణి చేశారు. అనంతరం కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ.. చికిత్స పొందుతున్న 15 మంది ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్య నిపుణులు చెప్పిన ప్రకారం మరో రెండు వారాల పాటు వైద్య శిబిరాలు కొనసాగుతాయని తెలియజేస్తూ..

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన -- PMAY గ్రామీణ కింద రాష్ట్రంలో అమలు చేసిన తొలి 3డి ప్రింటెడ్ గృహాల పైలట్ ప్రాజెక్టుపై ఢిల్లీలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటు ధరల్లో గృహ నిర్మాణానికి 3డి ప్రింటెడ్ గృహాలు దోహదపడతాయన్నారు. పర్యావరణహిత నిర్మాణ విధానం, దృఢమైన నిర్మాణం, శుభ్రమైన తాగునీటి సరఫరా, మురుగు శుద్ధి వ్యవస్థ, రహదారి అనుసంధానం వంటి సమగ్ర సదుపాయాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

---------------------------

రాష్ట్ర శాసన సభ సమావేశాలు కొనసాగుతున్నాయి. సభ ప్రారంభమైన వెంటనే ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. ఇక 2024 - 25 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ సంస్థ లిమిటెడ్‌కు సంబంధించిన వార్షిక నివేదిక, 2020 - 21 సంవత్సరానికి గాను తిరుపతి పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ వార్షిక గణాంకాలను పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ సభలో ప్రవేశపెడతారు. రహదారులు, భవనాలు, రవాణా, దేవాదాయ శాఖలు, రాష్ట్ర శాసన వ్యవస్థ కోసం నిధుల కేటాయింపులపై చర్చ జరుగుతుంది.

---------------------------

రాష్ట్రంలో ప్రాంతాలవారీగా పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు - ఎంఎస్ఎమ్ఈ పార్కులు ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ పార్కుల ద్వారా స్థానిక పారిశ్రామికవేత్తలకు తక్కువ ఖర్చుతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఆయా ప్రాంతాలలో లభించే వనరుల ఆధారంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

చేనేత మహిళా కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో టెక్స్ టైల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా టెక్స్ టైల్స్ పార్కుల

ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రజల అభిరుచికి తగ్గట్లుగా మార్కెటింగ్ నైపుణ్యాలు పెంచేలా తయారీదారులకు శిక్షణ ఇస్తున్నామని తెలియజేస్తూ...

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆహార భద్రత అధికారులు పాల సరఫరా కేంద్రాలు, పాడిపరిశ్రమకు చెందిన సంస్థలపై ఈ రోజు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సెంటర్, చిలకలపూడి ప్రాంతంలోని పలు పాల కేంద్రాల్లో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పాల కేంద్రాల నుంచి నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు. కొన్ని కేంద్రాల్లో నిర్ణీత ధర, తయారీ తేదీ లేకుండా, అత్యధిక కాలం నిల్వ ఉంచిన పాల ప్యాకెట్లను అధికారులు గుర్తించి కేసులు నమోదు చేశారు.

---------------------------

ఎన్టీఆర్ భరోసా కింద ఫించన్లను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28న పంపిణీ చేయనుంది. మార్చి 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లను అందజేయనున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 62 లక్షల 76 వేల 322 మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయనున్నామన్నారు. కొత్తగా మంజూరైన 8,977 మంది వితంతు పింఛను లబ్ధిదారులకు 3 కోట్ల 59 లక్షల రూపాయలు విడుదల చేశామని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది లబ్ధిదారులకు నగదును ఇంటి వద్దే అందజేస్తారని మంత్రి వివరించారు.

---------------------------

దేవాలయాలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల శాసన సభ్యులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైయస్సార్ కడప జిల్లా పులివెందులలోని నందిపల్లిలో నిర్వహించిన నందీశ్వర ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో ఈ రోజు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ధార్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని తెలిపారు.

---------------------------

విద్యతో పాటు పరిపాలన వ్యవహారాలపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. ఏలూరు జిల్లా అగిరిపల్లిలోని ఒక విద్యాసంస్థకు చెందిన కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ –AI&ML విభాగం విద్యార్థులు అమరావతిలో జరుగుతున్న శాసన సభ సమావేశాల కార్యక్రమాలను ఈ రోజు వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. శాసనసభను సందర్శించి, ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల కార్యక్రమాలను నేరుగా చూడడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును స్వయంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

---------------------------

యువత చదువుకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా యువజన అధికారి ఏ. మహేంద్ర రెడ్డి సూచించారు. 'మేరా యువ భారత్', ఆధ్వర్యంలో జిల్లాలోని కావలిలో నిర్వహించిన "యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొన్నారు.

=====================